
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
ఆదివారం 5 మే 2024



పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభం

తొలిరోజు ఓటేసిన 199 మంది ఉద్యోగులు

ములుగు కలెక్టరేట్, మే 4: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. జిల్లాకేంద్రంలోని సంక్షేమ భవన్‌లో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లో 16 పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి ఏడు టేబుల్స్‌ను సిద్ధం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొననున్న పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు, అత్యవసర డ్యూటీలు నిర్వర్తించే ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది కలిపి మొత్తం 2,364 మంది ఫారం 12ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా తొలిరోజు 199 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చిత్రమిశ్రా, అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అప్రమత్తంగా నిర్వహించాలని, ఎలాంటి తప్పిదాలు జరుగకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనల మేరకు బ్యాలెట్ పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఓటుహక్కు వినియోగించుకునేలా అప్రమత్తం చేస్తామని, ఎన్నికల కమిషన్ నుంచి రిజిష్టర్ మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజ్‌ప్రకాశ్ పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులు

టస్సర్ వస్త్రాలను కొనుగోలు చేస్తాం

చేనేత శాఖ కమిషనర్ అలుగు వర్షిణి



మగ్గాలను పరిశీలిస్తున్న చేనేత శాఖ కమిషనర్

మహదేవపూర్, మే 4: మహదేవపూర్‌లో తయారవుతున్న టస్సర్ వస్త్రాలకు సరైన గుర్తింపు తీసుకువచ్చి టెస్కాబ్ ద్వారా కొనుగోలు చేసేందుకు కృషి చేస్తామని చేనేత శాఖ కమిషనర్ అలుగు వర్షిణి అన్నారు. మండల కేంద్రంలోని టస్సర్ కాలనీలో చేనేత మగ్గాలను శనివారం ఆమె పరిశీలించారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా టస్సర్‌ను సరికొత్త డిజైన్‌లోఉత్పత్తి చేయాలని సూచించారు. దీనికోసం ప్రత్యేకంగా శిక్షణను ఇప్పిస్తామన్నారు. నాణ్యతతో వస్త్రాలను నేయాలన్నారు. అంతకు ముందు శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని ఆమె సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల నుంచి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హైదరాబాద్‌కు దీటుగా

వరంగల్ అభివృద్ధికి కృషి

రాజ్యాంగ రక్షణకు కాంగ్రెస్‌ను గెలిపించాలి

వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య

ఆర్ఎన్ఆర్ గార్డెన్స్‌లో కాజీపేట మండల బూత్ కమిటీ విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కడియం కావ్య

7లో



హనుమకొండ ఏకశిల పార్కులో ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్

భారత్‌కు మోదీ నాయకత్వం అవసరం

బీజేపీకి సంపూర్ణ మద్దతు అందించాలి

మోదీ ఆశీస్సులతో వరంగల్ రూపు రేఖలను మారుస్తా..

ఏకశిల పార్కులోని వాకర్స్‌తో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

నేడు 'నీట్'

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 పరీక్షా కేంద్రాలు

పరీక్ష రాయనున్న 5,445 మంది విద్యార్థులు

నిమిషం ఆలస్యమైతే అంతే..

వరంగల్ ఎడ్యుకేషన్, మే 4: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నీట్-2024 పరీక్ష ఆదివారం జరుగనుంది. పూర్తిగా ఆఫ్‌లైన్‌లో జరుగనున్న పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నీట్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం. మంజులాదేవి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,445 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. అన్ని పరీక్షా కేంద్రాలకు ఎన్‌టీఏ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్, ఫ్రిస్కింగ్ యంత్రాలు, సీసీ కెమెరాల ఏర్పాట్లు చేశారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కోఆర్డినేటర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష ఉంటుందని, ఉదయం 11.30 నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తామని ఆమె చెప్పారు. అయితే మధ్యాహ్నం 1.30 దాటితే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించరని ఆమె స్పష్టం చేశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను ఎలాంటి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని ఆమె స్పష్టం చేశారు.



తాళ్లపద్మావతి సెంటర్‌లో ఏర్పాట్లును పరిశీలిస్తున్న సిటీ కోఆర్డినేటర్ మంజులాదేవి

కాంగ్రెస్, బీజేపీలకు

ఓటుతో బుద్ధి చెప్పాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల మండలంలో విస్తృత ప్రచారం

వివరాలు 7వ పేజీలో...



కొడకండ్లలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

హోం ఓటింగ్‌ను వినియోగించుకున్న 30 మంది

8లో

బలరాంనాయక్‌కు మాతృవియోగం

నేడు హనుమకొండలో అంత్యక్రియలు

ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉష్ణోగ్రతలు

భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మండుటెండలు

వడదెబ్బకు ఒకేరోజు ముగ్గురి మృతి

భూపాలపల్లిటౌన్, మే 4: జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో వేసవి తీవ్రత పెరుగుతోంది. 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటి రెడ్ జోన్‌లోకి వచ్చింది. బుధవారం నుంచి ఈ ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. శనివారం సైతం రెండు మండలాల్లో 45 డిగ్రీలు నమోదయ్యాయి. మల్హర్ మండలంలో 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. కాటారం మండలంలో 45.2 నమోదైంది. అలాగే మొగుళ్లపల్లిలో 44, చిట్యాల మండల కేంద్రంలో 44, గణపురంలోని చెల్పూరులో 44.8 డిగ్రీలు, మహదేవపూర్‌లో 43.1, మహాముత్తారంలో 43.2, పలిమెలలో 42.8, భూపాలపల్లిలో 42.4, టేకుమట్లలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ములుగు, మే 4: జిల్లాలో వేసవి ఎండ తీవ్రత ప్రమాదకర స్థాయిలో కొనసాగుతోంది. శనివారం వెంకటా పురం(నూగూరు) మండలం ఆలుబాక, వెంకటాపూర్(రామప్ప) మండలం లక్ష్మీదేవిపేటలో అత్యధికంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వాజేడు మండలం ధర్మవరంలో 44, మంగపేటలో 43.9, తాడ్వాయిలో 43.5, ములుగు మండలం ఖాసిందేవిపేటలో 43.2, కన్నాయిగూడెం, గోవిందరావుపేటలో 42.9, ఏటూరునాగారం మండలంలో 41.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

వడదెబ్బకు గురై రైతు మృతి



లస్మయ్య (ఫైల్)

కాటారం : వడదెబ్బతో రైతు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలం రేగులగూడెంలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మేకల లస్మయ్య (55) యాసంగి పంటగా వరిని సాగుచేశాడు. ఇటీవల పంటను కోసి వడ్లను ధాన్యం కొనుగోలు కేంద్రంలో పోశాడు. వడ్లను ఆరబెట్టడానికి, శుభ్రం చేయడానికి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం కూడా కొనుగోలు కేంద్రానికి వెళ్లి వడ్లను అటుఇటు కదిపేసి వచ్చాడు. ఇంటికి వచ్చిన అనంతరం అస్వస్థత గురికావడంతో భార్య లక్ష్మి 108కు ఫోన్ చేసింది. అంబులెన్స్ వచ్చిన తర్వాత ఈఎంటీ పరీక్షించగా అప్పటికే లస్మయ్య మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్యతోపాటు కూతురు ఉంది.

గోవిందరావుపేట మండలంలో...



లక్ష్మి (ఫైల్)

గోవిందరావుపేట : వడదెబ్బతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం రంగాపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ వంక నాగేశ్వరరావు తల్లి లక్ష్మి (70) శుక్రవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చాక అస్వస్థత్తకు గురై రాత్రి కన్నుమూసింది. ఎండలో వడ్లు ఏరే పని చేయడం వల్ల వడదెబ్బకు గురైందని గ్రామస్థులు తెలిపారు. లక్ష్మి మృతదేహాన్ని కాంగ్రెస్ నాయకులు శనివారం సందర్శించి నివాళులర్పించారు.


ములుగులో..

ములుగు : వడదెబ్బతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా కేంద్రంలో జరిగింది. ఎస్సై వెంకటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగుకు చెందిన ఈగ ప్రమీల (69) కొన్నేళ్లక్రితం భర్త, పిల్లలు మరణించడంతో ఒంటరిగా మారింది. సొంత ఇల్లు లేకపోవడంతో స్థానిక కూరగాయల మార్కెట్‌లోని ఓ గదిలో గ్రామపంచాయతీ అధికారులు ఆమెకు ఆశ్రయం ఇచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ఎండవేడికి తట్టుకోలేక తీవ్ర అస్వస్థతకు గురై గదిలోనే మరణించింది. రాత్రివేళ గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వృద్ధురాలి మృతదేహానికి పంచనామా నిర్వహించి ప్రభుత్వ ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. సమీప బంధువు రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి మృతదేహాన్ని అప్పగించారు.



వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్





పారిశుధ్య డ్రైవర్లకు అందని వేతనాలు

- మూడు మాసాలుగా జీతాలు లేక పస్తులు
- దీనావస్థలో 163 మంది డ్రైవర్ కం ఓనర్లు
- కమిషనర్ స్పందించాలని వేడుకోలు



నగరంలో పని చేస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికులు



వరంగల్ కార్పొరేషన్, మే 4 : గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. దీంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. గతంలో క్రమం తప్పకుండా నెలవారి జీతా లు బ్యాంకులలో జమ అయ్యేవని, ఇప్పుడు సక్రమంగా జీతాలు రాక తమ జీవి తాలు అగమ్యగోచరంగా మారాయని మనోవేదనకు గురవుతున్నారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు మూడు మాసాల డబ్బులు నేటికీ అందలేదని ఆరోపిస్తు న్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు కలిసి విన్నవించినా కాల యాపన చేస్తున్నారని మండిపడుతున్నారు.

163 మందికి అందని జీతాలు

వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో కాలనీల నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరించేందుకు ఓనర్ కం డ్రైవర్లు 163 మంది పని చేస్తున్నారు. వీరికి నగర పాలక సంస్థ కాంట్రాక్టర్ నుంచి ఒక్కరికి నెలకు రూ.15వేల జీతంతో పాటు రూ.4వేల ఇతర అలవెన్స్‌లు ఇస్తున్నారు. అందరికీ కలుపుకుని ప్రతీ నెల రూ.30.96లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే మూడు మాసాలకు గాను ఒక్కొక్కరికి రూ.57వేలు రావాల్సి ఉందని వెల్లడించారు. జీతాలు రాకపోవడంతో ఇల్లు గడవకపోవడంతో పాటు స్వచ్ఛ ఆటోల నెల వారి కిస్తీలు నిలిచిపోయాయని వాపోయారు. కొన్ని వాహనాలు వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ కంపెనీలు లాక్కుని వెళుతున్నారని అసహనం చేస్తున్నారు. సంబంధిత అధికారులను అడిగితే బ్యాంకులో చెక్కు వేశామని, డబ్బులు జమవుతున్నాయని జాప్యం చేస్తున్నట్టు చెప్పారు.

కాగా, తమకు సక్రమంగా జీతాలు వచ్చే విధంగా కమిషనర్ చొరవ చూపాలని స్వచ్ఛ ఆటోల సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల ఎన్నికైన డ్రైవర్ల సంఘం, కార్మిక సంఘాలు సైతం స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. లేదంటే ఆటోల బంద్ పాటించి కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

మిర్చి రైతు విలవిల..!

- ఈ ఏడాది భారీగా పడిపోయిన ధరలు
- పట్టించుకోని మార్కెటింగ్ అధికారులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఈ ఏడాది మిర్చి పంట రైతులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. గతేడాది మిర్చి పంటకు భారీగా మద్దతు ధర లభించింది. ఇక ఉమ్మడి వరంగల్‌లోనే ప్రత్యేకంగా సాగు చేసే చపాట (టమాట) రకం మిర్చికి అత్యధికంగా క్వింటాల్‌కు రూ.95వేల వరకు ధర దక్కింది. మిగతా వివిధరకాల మిర్చికి కూడా ఆశించిన దానికంటే అధికంగా ధరలు రావడంతో రైతులు ఈ ఏడాది కూడా మిర్చి సాగుకే మొగ్గు చూపారు. అయితే ఈ ఏడాది వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు భారీగా పడిపోవటంతో రైతులు ఆందోళనచెందుతున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలుచేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఖమ్మం, మహబూబాబాద్, కేసముద్రం మార్కెట్‌లో ఉన్న ధర వరంగల్ మార్కెట్‌లో లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే గత ఏడాది వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో టమాట మిర్చి క్వింటాలుకు రూ.95వేలకుపైగా ధర పలికింది. కానీ ఈ సీజన్‌లో రూ.18వేల నుంచి రూ.40వేలు వరకే ధర రావటంతో ఎన్నో ఆశలతో టమాట మిర్చి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అలాగే అత్యధికంగా రైతులుసాగుచేసే తేజరకం మిర్చికి గతేడాది రూ.25వేల అత్యధిక ధర పలకగా ప్రస్తుతం రూ.13వేల అత్యధికంగా అమ్ముకోవాల్సి వస్తోంది. వండర్‌హాట్‌రకానికి గతేడాది రూ.42వేలు ధర ఉండగా ఈసారి కేవలం రూ.22వేలు మాత్రమే పలుకుతోంది. 341రకం మిర్చి ధర గతేడాది రూ.23వేలు ఉండగా, ఈసారి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు అమ్మకాలు చేస్తున్నారు. 5531 రకం మిర్చికి గతేడాది రూ.25వేలు ప్రస్తుతం రూ.8వేల నుంచి రూ.11వేల ధరే పలుకుతోంది. సింగల్ పట్టీ రకం మిర్చి గతేడాది రూ.45వేల వరకు ధర పలకగా ఈసారి కేవలం రూ.22వేలు అత్యధికంగా ధర ఉంది. దీపిక మిర్చి గతేడాది రూ.25వేల వరకు ధర పలకగా రూ.12వేలకు కూడా ఎవరు కొనే పరిస్థితి లేదు. ఇలా అన్ని రకాల మిర్చి ఉత్పత్తులకు ధరలు పడిపోయాయి. దీంతో దిక్కుతోచని రైతులు గిట్టుబాటు ధర వచ్చినప్పుడే మిర్చిని విక్రయించుకునేందుకు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకునేందుకు మొగ్గుచూపుతున్నారు.

కోల్డ్ సోరేజీల్లో దోపిడీ..

కొంతకాలంగా అధిక లాభాలు వస్తుండటంతో రైతులు మిర్చి సాగుపై దృష్టిపెట్టారు. దీంతో ఎకరానికి రూ.1.30లక్షల నుంచి రూ.1.50లక్షల వరకు పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేశారు. అయితే ఈ సారి ఆశించినస్థాయిలో మార్కెట్‌లో మిర్చి డిమాండ్ లేకుండా పోయింది. ఎక్కువ మిర్చి మార్కెట్‌కు రావటంతో పాటు విదేశాల్లో కూడా మిర్చికి డిమాండ్ లేకపోవటంతో మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో మద్దతు ధరలు లభించటంలేదు. దీంతో మిర్చి రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలకు తీసుకెళ్తున్నారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో 25స్టోరేజ్‌లు ఉండగా, సుమారు 27.50లక్షలకు పైగా బస్తాలను నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. వీటిలో సుమారు 3.60లక్షలకు పైగా పసుపుతోపాటు ఇతర పంటలను నిల్వ చేసుకున్నారు. మిగతా 24లక్షల బస్తాలను శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అయితే ఈసారి నిల్వ కోసం మిర్చి బస్తాలు అధికంగా వస్తుండటంతో కోల్డ్ స్టోరేజీలను కొంతమంది అడ్తీదారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అప్పటికే రైతులకు పెట్టుబడికి అడ్తీదారులు సాయంచేశారు. దీంతో మార్కెట్‌కు తీసుకవచ్చిన మిర్చిని ప్రస్తుతం ఉన్న తక్కువ ధరకు విక్రయించి, అడ్తిదారులు అప్పు తీర్చాలి. లేదంటే వారు సూచించిన కోల్డ్ స్టోరేజీల్లో మిర్చి బస్తాలను నిల్వ చేయాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో చాలా మంది రైతులు తక్కువ ధరకే మిర్చిని అమ్ముకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు రైతులు మాత్రం కోల్డ్ స్టోరేజీల్లో నిల్వకు మొగ్గు చూపారు. గత కొన్నాళ్లుగా కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకునే ఒక బస్తాకు రూ.160 వరకు కిరాయి చెల్లించారు. బీమా కోసం మరో రూ.8 వరకు వసూళ్లు చేసేవారు. రూ.168తో డిసెంబరు 31 వరకు ఒక బస్తా కోల్డ్ స్టోరేజీలో ఉండేది. అయితే ఈసారి కొంతమంది అడ్తీదారులు అడ్వాన్స్‌గా కోల్డ్ స్టోరేజీలను తమ ఆధీనంలో పెట్టుకోగా, మరికొందరు అడ్తీదారులకే స్టోరేజీలున్నాయి. మొత్తంగా కోల్డ్ స్టోరేజీలు అడ్తీదారుల గుప్పెట్లోనే ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో ఒక బస్తా స్టోరేజీకి రూ.160 ఉన్న ఫీజును ఏకంగా రూ.250 నుంచి రూ.300 వరకు పెంచి వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో బస్తాపై మిర్చి రైతుల నుంచి అదనంగా ఫీజుల పేరుతో రూ.90 నుంచి రూ.140 వరకు వసూలు చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. కోల్డ్‌స్టోరేజీల్లో ఈ సీజన్‌లో 22లక్షల బస్తాల నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఈ లెక్కన సుమారు రూ.20కోట్లకు పైగా రైతుల నుంచి స్టోరేజీ ఫీజు పేరుతో అదనపు దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్లో మిర్చి పంటకు సగం కూడా ధర లేక దిగాలులో ఉన్న రైతులపై కోల్డ్ స్టోరేజీల్లో అదనపు వసూళ్లతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.

రైతు గోస పట్టని అధికారులు..

ఇప్పటికే మిర్చి ధరలులేక పుట్టెడు దుఖంలో ఉన్న రైతులకు పెరిగిన కోల్డ్ స్టోరేజీ ఫీజుల ధరలు మరింతా భారాన్ని మోపుతున్నాయి. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో 27 శీతల గిడ్డంగులు ఉంటే వీటిలో కేవలం తొమ్మిదింటిలోనే ప్రభుత్వ సబ్సిడీ అందుతుందని, మిగతా వాటితో తమకు సంబంధం లేదని మార్కెటింగ్ అధికారులు చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శీతల గిడ్డంగుల అనుమతుల సమయంలోనే ప్రభుత్వం నిర్ణయించిన ధరలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలనే నిబంధన ఉందని రైతులు పేర్కొంటున్నారు. అడ్తీదారుల గుప్పెట్లో ఉన్న కోల్డ్ స్టోరేజీల వైపు మార్కెటింగ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎర్రటి ఎండలో తాము పడుతున్న గోస అధికారులు పట్టించుకోవటం లేదని అన్నదాతలు వాపోతున్నారు. కోల్డ్ స్టోరేజీల ధరలను తగ్గించడంతో పాటు అధిక ఫీజు వసూలు చేసిన గిడ్డంగుల యాజమానులపై చర్యలు తీసుకోవాలని, వ్యాపారులు కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్న సిండికేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నుంచి రంగనాథుడి బ్రహ్మోత్సవాలు

- రామానుజ జయంతి వేడుకలు
- ముస్తాబైన 700 ఏళ్ల ఆలయం



రంగనాయక ఆలయం, మూలవిరాట్టు శ్రీరంగనాథుడు

హనుమకొండ కల్చరల్, మే 4 : హనుమకొండ బ్రాహ్మణవాడ రాగన్నదర్వాజలోని 700 యేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన రంగనాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు భగవత్ రామానుజుల తిరునక్షత్రోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఆలయాన్ని సుందరంగా ముస్తాబుచేశారు. తెలంగాణాలోనే అరుదైన రామానుజుల వారి సన్నిధిగా పేరున్న రంగనాథస్వామి ఆలయాన్ని ఆదివారం నుంచి అనేక మంది వైష్ణవ ప్రముఖులు, భక్తులు ఆలయాన్ని సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

తమిళనాడు ప్రాంతంలో ఎక్కువగా ఉండే ఆలయాల మాదిరిగా ఇక్కడి ఆలయంలో రంగనాథుడితోపాటు రామానుజులు మూలవరులుగా ఉండటం విశేషం. ఇక్కడి విగ్రహాలన్నీ ఏకశిలా నిర్మితాలే. మూలవిగ్రహం అయిన రంగనాథస్వామి వారి మకరతోరణంపై ఎక్కడా లేని విధంగా దశవతారాలు దర్శనమిస్తాయి. ఆలయ గోపురం, సింహద్వారాలు, ఇతర ఆలయాలకు దీటుగా ప్రత్యేకంగా కనిపిస్తాయి. కాకతీయకాలానికి చెందిన రాతి కట్టడాలు ఇక్కడ కొన్ని కనువిందు చేస్తాయి. ఆలయం మొత్తం శిలా నిర్మితమైతే గోపురం మాత్రం సున్నపురాయి ఇటుకతో తయారైంది. ఇక్కడి స్వామివారు పిలిస్తే పలికి తమ కోరికలు ఈడేస్తారన్నది భక్తుల విశ్వాసం. హనుమద్గిరి రాజమందిర అని పిలిస్తే ఆ శబ్దం ద్వారా భగవంతుడు భక్తుల కోరికలు నెరవేరుస్తారన్నది విశ్వాసం. ప్రతీయేటా వైశాఖ పౌర్ణమికి ప్రత్యేక శత కలష క్షీరాభిషేకంతోపాటు ఆలయ బ్రహ్మోత్సవాలు, రామానుజ జయంతి వేడుకలు జరగడం ఈ ఆలయ ప్రత్యేకత. ఆదివారం ఉదయం బిందె తీర్థం, అంకురారోహనం, ధ్వజరోహనంతో ప్రారంభమై రాత్రి 7గంటలకు రంగనాయస్వామి వారి కల్యాణం జరగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కలకోట రాఘవాచారి, నర్సింహాచారి తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగే వేడుకల పర్వంలో భాగంగా 12వ తేదీన రామానుజులకు వైభవంగా అష్టోత్తర శతకలష క్షీరాభిషేకంతో వేడుకలు ఆసాంతం కానున్నాయి. ఈ వేడుకల్లో సముద్రాల శఠగోపాచార్య, టీకే శ్రీనివాసన్, హైదరాబాద్‌కు చెందిన వంశీ కృష్ణమాచార్య, తిరువరంగం దాసా శేషాచార్య, వేలేటి రవికుమారాచార్య తదితర ప్రముఖులు ఆలయంలో జరిగే ధార్మిక ఉపన్యాసాల్లో పాల్గొంటారు.

భారత్‌కు మోదీ నాయకత్వం అవసరం


కాశిబుగ్గలో మాట్లాడుతున్న అరూరి రమేష్

- బీజేపీకి సంపూర్ణ మద్దతు అందించాలి
- మోదీ ఆశీస్సులతో వరంగల్ రూపు రేఖలను మారుస్తా..
- ఏకశిల పార్కులోని వాకర్స్‌తో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

హనుమకొండ టౌన్/బాలసముద్రం, మే 4 : దేశ ప్రజలు ప్రశాంతంగా బతుకుతూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే భారత్‌కు తిరిగి మోదీ నాయకత్వం అవసరమని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి హనుమకొండ ఏకశిలపార్కులోని వాకర్స్‌ను అరూరి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ.. 11వ ఆర్థిక శక్తిగా ఉన్న భారత్‌ను మోదీ ప్రపంచంలోనే 5వ స్థాయికి తీసుకొచ్చాడని, మూడోసారి ఆశీర్వదించి మోదీని ప్రధాని చేస్తే దేశాన్ని ప్రపంచంలోనే 3వ ఆర్థిక శక్తిగా నిలబెడుతాడన్నారు. దేశం వైపు ఉగ్రవాదులు తొంగిచూడొద్దంటే మోదీని దేశ రక్షకుడిగా నియమించుకోవాలన్నారు. మోదీని విస్మరిస్తే కాంగ్రెస్ చేతిలో చిత్రహింసలు పడక తప్పదన్నారు.

కాంగ్రెస్ వస్తే కర్ఫ్యూలు, మత కల్లోలాలు, స్కామ్‌లు వెంటాడుతాయని, తద్వారా దేశ ప్రజలు ఇబ్బందులకు గురవుతారని అరూరి హెచ్చరించారు. దేశంతోపాటు వరంగల్ బాగుపడాలంటే కమలం పువ్వుగుర్తుకు ఓటు వేయాలన్నారు. దేశ ప్రజలే కాకుండా ప్రపంచంలోని ఇతర దేశాలు మోదీ కావాలని కోరుకుంటున్నారని, దేశంలో మోదీ వచ్చి వరంగల్‌లో మోదీ ప్రతినిధి లేకుంటే అభివృద్ధికి దూరమవుతామన్నారు. వరంగల్ నుంచి లోక్‌సభకు తనను పంపిస్తే 10యేళ్ల అనుభవంతో వరంగల్ రూపురేఖలను మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రావుల కోమల కిషన్, డివిజన్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, ఉషారెడ్డి, జలేందర్‌రెడ్డి, ఆదిరెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, సీనియన్ సిటిజన్ వాకర్స్ అధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

శ్రమిస్తున్న కర్మయోగి మోదీ

మిల్స్‌కాలనీ : దేశం కోసం అలుపెరగక శ్రమిస్తున్న కర్మ యోగి ప్రధాని నరేంద్ర మోదీ అని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటీవ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. కాశిబుగ్గలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ప్రజల ఆదరణ చూరగొన్న మహనీయుడు మోదీ అని కొనియాడారు. రెండుసార్లు ప్రధానిగా అవినీతి, బంధుప్రీతి మచ్చుకు కూడా కనిపించని మోదీకి మరోమారు ప్రధానమంత్రిగా అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. దేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిన మహానుభావుడు మోదీ అని కీర్తించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, ఆక్రమణలు, బంధుప్రీతి, స్వార్థం తొనికిసలాడేదన్నారు. అన్ని కుంభకోణాలేనని, వేలకోట్ల అవినీతి మరక లేనని ఆరోపించారు. ఈసారి కేంద్రంలో బీజేపీ వచ్చాక మామునూరు ఎయిర్‌పోర్టును పునరుద్ధరిస్తామని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసర విజయచందర్‌రెడ్డి, రత్నం సతీష్‌షా, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, ఆడెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మడికొండ : గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌కు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు స్థానిక కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు సమక్షంలో వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చందరాజు యాదగిరి, అన్నందాస్ అశోక్, గన్నరం కుమార్, బండి వెంకటయ్య, గడ్డం సదానందం, మునిగాల వెంకటరత్నం, మునిగాల బాబు తదితరులున్నారు. కార్యక్రమంలో నాయకులు కుందూరు రాజేశ్‌రెడ్డి, మునిగాల కట్టయ్య, బొల్లికొండవినోద్, బుర్ర రాజన్‌బాబు, దువ్వ నవీన్, కొలిపాక కుమార్‌బాబు, పిట్టల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

అభివృద్ధి చేయకుంటే మళ్లీ ఓట్లు అడగం


కాజీపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న కడియం కావ్య

- కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాజీపేటలో కడియం కావ్య ఇంటింటి ప్రచారం

కాజీపేట, మే 4 : 'కాజీపేటను అభివృద్ధి చేయకుంటే మళ్లీ ఎన్నికల్లో ఓట్లే అడగను.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి' అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కాజీపేట అభివృద్ధిని బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ పార్టీ కాజీపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కాజీపేట మీడియా పాయింట్‌లో శనివారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు.

రైల్వేపరంగా సికింద్రాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యమైన కాజీపేటను గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాజీపేటలో బస్టాండ్, చౌరస్తా మోడల్ జంక్షన్, ఇంటర్, డిగ్రీ కళాశాలలను నిర్మించి తీరుతామన్నారు. మతతత్వాన్ని రెచ్చగొట్టే బీజేపీకి, కుటుంబపాలనలో భూ కబ్జాలకు పాల్పడిన బీఆర్ఎస్‌ను ప్రజలు బొందపెట్టాలన్నారు. రోడ్‌షోల పేరిట ప్రచారం పాల్గొంటున్న కేసీఆర్‌కు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో రూ.30 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. రాబోయే రోజుల్లో కాజీపేట అభివృద్ధి పూర్తి బాధ్యత తానే తీసుకుంటానని చెప్పారు. శనివారం కాజీపేటలో జరుగనున్న కడియం కావ్య ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో స్థానిక కార్పొరేటర్లు ఎలకంటి రాములు, జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీరజాలీ, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, నాయకులు ఎండీ అంకూస్, పాలడుగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కావ్య ఇంటింటి ప్రచారం

వరంగల్ ఎంపీగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కడియం కావ్య శనివారం ఉదయం కాజీపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాజీపేట 47, 62, 63వ డివిజన్‌లలో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కడియం కావ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో నాయకులు సందెల విజయ్, మేరుగు రాజయ్య, బైరబోయిని రమేశ్, సిటీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కట్ల శ్రీను, కాసర్ల నగేశ్, ఎండీ అంకూస్, షేక్ అజ్గర్, పోగుల సంతోష్, మేకల ఉపేందర్, పసునూరి మనోహర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధికి కృషి

- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య

మడికొండ, మే 4 : హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య హామీ ఇచ్చారు. మడికొండలోని ఆర్ఎస్ఆర్ గార్డెన్స్‌లో శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన కాజీపేట మండల బూత్ కమిటీల సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి కడియం కావ్య పాల్గొని మాటాడారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుతోపాటు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయిస్తానన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధిరంగాల్లో వరంగల్ నగరాన్ని ఎడ్యుకేషన్ హబ్, ఐటీ హబ్, ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. మడికొండ శివారులోని డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే స్వేచ్ఛగా బతకగలుగుతున్నామని, అలాంటి రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లను రద్దు చేయాలంటున్న బీజేపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

అలాగే బీజేపీ నుంచి దేశానికి విముక్తి కలగాలంటే రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతోనే సాధ్యమవుతుందని కావ్య తెలిపారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ భూకబ్జాలు అందరికీ తెలిసినవేనన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్‌రావు, దొమ్మాటి సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడపాల రఘుచందర్, నాయకులు వస్కుల శంకర్, కుర్ల మోహన్, బిల్ల రవిందర్, బైరి లింగమూర్తి, గుర్రం జ్యోతిఅమర్‌నాథ్, వస్కుల నాగరాజ్, వస్కుల భాస్కర్, రజినీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీని గద్దె దించాలి

- టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

మహబూబాబాద్‌టౌన్, మే 4: ప్రజా సమస్యలను విస్మరించి, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ.. కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని తెలంగాణ జనసమితి (టీజేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నేతలు ప్రకటనలు చేస్తున్నారని, దీంతో రిజర్వేషన్లు ఉంటాయో లేదోనన్న అనుమానం కలుగుతుందని చెప్పారు. బీజేపీ పాలకులు మేలు చేయకపోగా, దేశంలో సమస్యలు సృష్టించిందని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్లను తీసుకువచ్చి అన్నదాతలకు అన్యాయం చేశారని విమర్శించారు. సమావేశంలో టీజేఎస్, టీపీజేఏసీ నేతలు అంబటి శ్రీనివాస్, షైన శ్రీనివాస్ మామిడాల సత్యనారాయణ, జావిద్, పట్టాభి లక్ష్మయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

మొదలైన.. ఇంటి నుంచే ఓటు

- వరంగల్ లోక్‌సభ స్థానంలో 1,806 మంది దరఖాస్తు
- 121 మంది ఓటు హక్కు వినియోగం

హనుమకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకోవడం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గంలో శుక్రవారం 121 మంది తమ ఓటు హక్కును ఇంటి నుంచి వినియోగించుకున్నారు. పోలింగ్ అధికారులు శుక్రవారం నుంచి 85 యేళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతానికి మించి వైకల్యం కలిగిన దివ్యాంగుల ఇంటి వద్దకే అధికారులు వెళ్లి ఓట్లు వేయిస్తున్నారు. వృద్ధులు, ఇందు కోసం అధికార యంత్రాంగం అన్నిఏర్పాట్లు చేసింది. అవసరమైన సిబ్బందిని నియమించింది. ఇంటి నుంచి ఓటు వేసే అవకాశాన్ని ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఈ మేరకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి.


నెక్కొండ మండలం చం... ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కొడకండ్ల మండలంలో విస్తృత ప్రచారం

కొడకండ్ల, మే 4 : కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన జనగామ జిల్లా కొడకండ్ల మండలం లక్ష్మక్కపెల్లి, పెదబావితండా, బోడోనికుంటతండా, సీఎం తండా, రామన్నగూడెం, నీలిబండ తండా, మొండ్రాయి, కొడకండ్ల, హక్యాతండా, జీబీతండా, రామవరం, రామేశ్వరం, పాకాల గ్రామాల్లో స్థానిక ముఖ్యనాయకులతో కలిసి ప్రచారం చేశారు. కొడకండ్లలో చెరువు వద్ద పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పని చేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని సూచించారు. తెలంగాణ హక్కులను కాపాడేది ఒక్క బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ గళం పార్లమెంటులో వినిపించాలంటే బీఆర్ఎస్ ఎంపీల సంఖ్య అధికంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన కళ్లబొల్లి మాటలు విని ప్రజలు వారికి ఓటు వేశారని, కానీ ఆ పార్టీ ఇచ్చిన హామీలలో ఇప్పటివరకు ఎన్ని అమలు చేశారో ఆలోచించాలని ప్రజలకు సూచించారు. రైతుబంధు అందరికీ రాలేదని, మహిళలకు ఇస్తానన్న నెలకు రూ.2500, రూ.2లక్షల రుణమాఫీ, రూ.500లకు గ్యాస్ సిలిండర్, కల్యాణలక్ష్మిలో అదనంగా తులం బంగారం అమలు కాలేదన్నారు. కరెంట్ సక్రమంగా వస్తోందా..? సాగు, తాగునీరుఅందుతోందా..? అంటూ జనాలను ప్రశ్నించారు. కాంగ్రెస్‌పార్టీ 420 హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు ఎందుకు వేయాలో ఆలోచించాలన్నారు. ఆ రెండు పార్టీల వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని తెలియజేస్తూ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించేలా కృషి చేయాలని సూచించారు. కన్నతల్లిలాంటి బీఆర్ఎస్‌ను మోసం చేసిన కడియం శ్రీహరితో పాటు అరూరి రమేష్‌కు ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.


పాకాలలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

బీఆర్ఎస్‌లోకి పునరాగమనం

బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పెదబావితండా గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు వాంక్డోత్ లాలూనాయక్ శనివారం తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.జ్యోతి, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సింధె రామోసీ, నాయకులు డీ.ఏ.గాంధీ నాయక్, పేరం రాము, మసురం వెంకటనారాయణ, మేటి సోమరాములు, సతీష్, ఆసిఫ్, షన్ను, దూపాటి వెంకన్న, గ్రామశాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

హామీలు అమలు కావాలంటే కారు గుర్తుకు ఓటేయాలి


గన్నారంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

- కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పాల్సిందే..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, మే 4 : కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని తిర్మలాయపల్లి, గన్నారం, మైలారం, జత్తురాంతండా, గణేష్ కుంట తండా, రాగన్నగూడెం, మహబూబ్‌నగర్ గ్రామాల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్ఎస్ పార్టీనేనని స్పష్టంచేశారు. అందుకే పార్లమెంటులో బీఆర్ఎస్ గళం విప్పేలా గులాబీ దళం ఉండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిందని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి సంక్షేమ కనపడిందని, కాంగ్రెస్ వచ్చాక ఆగం, అధోగతి కనిపిస్తోందని అన్నారు. రాష్ట్రాన్ని ఆగంచేసిన కాంగ్రెస్‌పార్టీ మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని సూచించారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయించాలంటే ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని తెలిపారు. ఒక ఉద్యమకారుడికి ఇద్దరు మోసగాళ్లకు మధ్య జరుగుతున్న ఎన్నికలని గుర్తు చేశారు. తెలంగాణ కోసం గొంతెత్తి, తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. మార్పు అనగానే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని, కానీ రుణమాఫీ, రైతు బంధు, మహిళలకు రూ.2500 వచ్చాయా అంటూ.. ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిందన్నారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా రుణమాఫీ పేరిట రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఓట్లు వేసి ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఎందుకు ఓటు వెయ్యాలో చెప్పకుండా దేవుడిపై ఒట్లు వేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీకి చేసిన మోసానికి శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాల్సిన అవసరం ఉందని ఎర్రబెల్లి పేర్కొన్నారు. బీజేపీలో చేరిన అరూరి రమేష్ సైతం వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడని, వీరికి ఓటుతోనే సమాధానం చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ రాగానే రైతులు, నేతన్నల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం, మోటార్లు కాలడం మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఇందు కోసం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌ల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. ప్రజలను అమాయకులను చేసి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని, వీటిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ రంగు కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బయటకు వెళ్లాలంటేనే భయం

ఎండకు జంకుతున్న జనం
నిర్మానుష్యంగా మారుతున్నరోడ్లు
సింగరేణి కార్మికులకు తప్పని తిప్పలు



నిర్మానుష్యంగా ఉన్న భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా

భూపాలపల్లిటౌన్, మే 3: ప్రజలకు నాలుగు రోజుల నుంచి సమ్మర్ ఫీవర్ పట్టుకుంది. ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతుండడంతో బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. దీంతో మధ్యాహ్నం సమయంలో ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సింగరేణి కార్మికులు, ఇతర చిరు వ్యాపారులకు మాత్రం పొట్టకూటి కోసం తిప్పలు తప్పవు అన్నట్టు తీవ్ర ఎండలోనే బయటకు వస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత కొనసాగుతోంది.

నాలుగు రోజుల ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే 43 డిగ్రీల నుంచి 46 డిగ్రీలకు చేరుకుంది. దీంతో భూపాలపల్లి జిల్లా రెడ్ అలర్ట్‌లోకి వెళ్లింది. దీంతో అధికారులు సైతం హెచ్చరికలు జారీ చేశారు. ఎండలో బయటకు వెళ్లొద్దని అంటున్నారు. ఒకవేళ అత్యవసర పనిపై వెళ్తే జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ఉదయం 10గంటల నుంచే ఎండ తీవ్రత కనిపించడంతో ప్రజలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు వెళ్లడానికి ఏ మాత్రం ఇష్టపడడం లేదు. దీంతో భూపాలపల్లిలోని రోడ్లన్నీ బోసిపోతున్నాయి. బుధవారం 43.4 డిగ్రీలు ఉన్న ఉష్ణోగ్రత గురువారం 45.3కు పెరిగింది. శుక్రవారం 46.3 డిగ్రీలకు చేరుకుంది. శనివారం 45 డిగ్రీలు ఉంది.

చల్లని పానీయాలపై దృష్టి

బయటకు వచ్చిన వారిలో ఎక్కువ మంది చల్లని పండ్ల రసాలను తాగడానికి మొగ్గుచూపుతున్నారు. వాటిని సేవించి కొంత ఉపశమనం పొందుతున్నారు. అయినప్పటికీ ఎక్కువ సమయం ఎండలో తిరగలేకపోతున్నామని అంటున్నారు. కొంతమంది ఇళ్లల్లో ఉన్నప్పటికీ తమకు కూలర్ల గాలి సరిపోవడం లేదని చెబుతున్నారు.

ఓసీ కార్మికుల ఆందోళన

సాధారణ ప్రాంతం కంటే బొగ్గు నిక్షేపాలు ఉన్న చోట వేడిమి ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఓపెన్‌కాస్టులో పనిచేసే కార్మికులకు యాజమాన్యం ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్నప్పటికీ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండను తట్టుకుని, దుమ్మూ దూళిని తట్టుకొని పనిచేయడం ఇబ్బందికరంగా ఉందని చెబుతన్నారు. ఈపీ ఆపరేటర్లకు ఏసీలు ఉండడం లేదు. దీంతో వారు అస్వస్థతకు గురవుతున్నారు. కొన్ని చోట్ల ఏసీ ఉన్నా అవి సరిగా పనిచేయడం లేదని అంటున్నారు. పని ప్రదేశంలో కనీస నీటి సౌకర్యం ఉండటం లేదని వేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉపశమనం కోసం తాటి ముంజలు కొనుగోలు చేస్తున్న జనం

బలరాం నాయక్‌కు మాతృవియోగం

నేడు హనుమకొండలో అంత్యక్రియలు

మహబూబాబాద్ టౌన్, మే 4 : కేంద్ర మాజీమంత్రి, మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ తల్లి లక్ష్మీబాయి (100) శనివారం కన్నుమూశారు. ములుగు జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీబాయి కొన్నేళ్లుగా హనుమకొండ టీచర్స్ కాలనీలోని తన కుమారుడి ఇంట్లో ఉంటున్నారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. తల్లి మృతివార్త తెలుసుకున్న పోరిక బలరాంనాయక్ కొత్తగూడెం బహిరంగసభను ముగించుకుని హుటాహుటిన వరంగల్‌కు చేరుకున్నారు. హనుమకొండలోని టీచర్స్ కాలనీలో ఆదివారం లక్ష్మీబాయి అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

లక్ష్మీబాయి మృతికి సీఎం సంతాపం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ తల్లి లక్ష్మీబాయి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ కుటుం బానికి సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గోపాలపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయరావు

చిట్యాల, మే 4: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని గోపాలపురం. దూత్‌పల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కేంద్రంలో ఇండియా కూటమి విజయం సాధించడం, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ఏకు రవీందర్, మూల శంకర్, సదయ్య, రాజేష్, దుప్పటి రమేష్, ఏకు సుగుణ, బత్తిని నారాయణ తదితరులు ఉన్నారు.

కావ్యను గెలిపించుకోవాలి

కొత్తపల్లిగోరి : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ నిరంకుశ పాలన గురించి కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంత రంగా పోరాడుతున్న రాహుల్ గాంధీని ప్రధానిని చేసే దశగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సంపత్‌రావు, విజ్జన్‌రావు, కిష్టయ్య, వీరేందర్ పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతులు పూర్తి చేయండి

రేగొండ: చెరువుల మరమ్మతు పనులను జూన్ కల్లా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఎంపీపీ పున్నం లక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. పంట దిగుబడి వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. చిన్నకోడెపాక చెరువు, మడ్తపల్లి చెరువు, రేపాక చెరువులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నిర్మల, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల వైద్యాధికారి హిమబిందు, పశు వైద్యాధికారి మైథిలి, ఐబీ ఏఈ రవికుమార్, జడ్పీటీసీ సాయిని విజయ, పీఏసీఎస్ ఛైర్మన్ విజ్జన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, మే 4: పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఆదివారం నుంచి ఈనెల 8 వరకు జరగనున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్, ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియపై సెక్టర్, ఈవీఎం కమిషనింగ్ అధికారులతో కలిసి కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని భూపాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో నాలుగు రూంలు ఏర్పాటు చేశామన్నారు. వరంగల్ పార్లమెంట్ ఓటర్లకు మూడు రూంలు, ఇతర నియోజకవర్గాలకు చెందిన ఓటర్లకు నాలుగో గదిని కేటాయించామన్నారు. జిల్లాలో మొత్తం 2,245 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించు కోనున్నట్లు తెలిపారు. భూపా లపల్లి జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న ఉద్యోగులు ఓటు వేసేందుకు ఈనెల 6న ప్రత్యేక సెలవు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సంఘం గుర్తించిన 12 కార్డుల్లో ఏదైనా చూపించి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈవీఎం కమిషనింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల్లో 42 మంది అభ్యర్థులు పోటీలో ఉన్న నేపథ్యంలో మూడు బీయూలను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీవో మంగిలాల్, తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా జడ్జి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి నారాయణబాబు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మే 4: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ప్రొఫెషర్ జయశంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా జడ్జి పి.నారాయణబాబు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగాల పార్టీ కాంగ్రెస్ : జిల్లా అధ్యక్షుడు అశోక్



మాట్లాడుతున పైడాకుల అశోక్

మంగపేట, మే, 4: త్యాగాల పార్టీ కాంగ్రెస్ అని జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్‌ను అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని కోరారు. మండలంలోని తిమ్మంపేటలో శనివారం జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్యతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక సంస్కరణలతో దేశాన్ని ఆర్థికాభివృద్ధి చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది అన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలన్నారు. మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల ఇన్‌చార్జిలు పూజారి సురేందర్‌బాబు, ఇర్సవడ్ల వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర వికలాంగుల ఛైర్మన్ ముత్తినేని వీరయ్య, మాజీ జడ్పీటీసీ కోట మల్లికార్జున్, కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ నాయకులు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిమ్మంపేట, బుచ్చంపేట, చెరుపల్లి, బాలన్నగూడెం గ్రామాల నుంచి సుమారు 200 మంది వివిధ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

బీజేపీలో బీఆర్ఎస్ నాయకుల చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న బీజేపీ నేతలు

కాటారం, మే 4: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారితో పాటు మల్హర్, మహాముత్తారం మండ లాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, యువకులు శనివారం బీజేపీలో చేరారు. పార్టీ నేత చల్లా నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి సమ క్షంలో తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీలో చేరిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ బండి రమేష్, దామెరకుంట మాజీ సర్పంచ్ తోడే వీరారెడ్డి, ఐత వీరారెడ్డి, ఎరకల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, యాదవ సంఘం నేత స్వామియాదవ్, లక్ష్మారెడ్డి, రాజస్వామి, రాజు, వేణు, లాకునాయక్, డోలి అర్జయ్య, మహాముత్తారం బీఆర్ఎస్ నేత రాజు, మహదేవపూర్ మండల నేత ఐలయ్య, మల్హర్ మండల నేతలు తిరుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఎన్నికలే కీలకం

కాకతీయఖని, మే 4: భారత రాజ్యాంగ పరిరక్షణకు ఈ పార్లమెంటు ఎన్నికలు ఎంతో కీలకమని ఏఐవైఎఫ్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ అన్నారు. భూపాలపల్లిలోని రావినారాయణరెడ్డి కార్యాలయంలో ఆ సంఘం ఆవిర్భావ వేడుకలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ నేటి యువత జాతీయ సమగ్రత కోసం పాటుపడాలని అన్నారు. మతతత్వ పార్టీలకు బుద్ధిచెప్పడంతోపాటు విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్, మాజీ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సతీష్, నాయకులు జోసెఫ్, తిరుపతి, భగత్, మహేందర్, రమేష్, చారి, కౌశిక్, స్వరూప, సుమలత, వసంత, రక్షిత తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ బీజేపీ అధికారంలోకి రావాలి

మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం నాయక్

వెంకటాపురం (నూగూరు), మే 4: ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. మళ్లీ బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. మండలకేంద్రంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు అట్లూరి రఘురాం, జాడి లక్ష్మి, త్రినాథ్, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ సీటును మోదీకి ఇవ్వాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి



చిట్యాలలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి

చిట్యాల, మే 4: బీజేపీ వరంగల్ లోక్‌సభ సీటును ప్రధాని మోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశీధర్‌రెడ్డి అన్నారు. పార్టీ అభ్యర్థి అరూరి రమేష్‌ను అధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మోదీ గాలి వీస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ చేర్చితే గెలుపు తథ్యం అన్నారు. బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈసమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్, పార్లమెంట్ కోకన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు, నియోజకవర్గం కన్వీనర్ మోరె రవీందర్‌రెడ్డి, కిరణ్, గుండ సురేష్, మాచర్ల రఘు, గజనాల రవీందర్, చెక్క నర్సయ్య, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గండ్ర

గణపురం, మే 4: పార్లమెంటు ఎన్నిల్లో బీఆర్ఎస్ వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. మండలంలోని చెల్పూరు, గొల్లపల్లి, బస్వరాజుపల్లి, పరుశురాంపల్లి, ధర్మరావుపేట గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి పార్టీని, కేసీఆర్‌ను బలపర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహరావు, పార్టీ మండలత అధ్యక్షుడు కర్ణాకర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీఛైర్మన్ పూర్ణచందర్‌రెడ్డి, నాయకులు ఉడుత సాంబయ్య, శ్రీనివాస్, కుమారస్వామి, రాజ్‌కుమార్, శ్రీనివాసరావు, దాసరి రవి, రాందాసు రాజు, దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఏఎస్సై మృతి



లక్ష్మణరావు (ఫైల్)

వాజేడు, మే 4: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఆర్పీఎఫ్ 39/ఎఫ్ బెటాలీయన్ ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు దేవరపల్లి లక్ష్మణరావు(45) మృతి చెందారు. ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో తుదిశ్వాస విడిచారు. వాజేడు ఎస్సై చవళ్ల వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏఎస్సై లక్ష్మణరావు శుక్రవారం రాత్రి భోజనం అనంతరం ఫిట్స్ వచ్చాయి. గమనించిన తోటి జవానులు ఎస్సైకు సమాచారం అందించారు. అనంతరం వాజేడు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణరావు మృతిచెందారు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా మర్రిపాడు మండలం చిటమట కాగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్సై తెలిపారు. సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. లక్ష్మణరావు సీఆర్పీఎఫ్ కంపెనీ తరుపున రెండు నెలల నుంచి వాజేడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తు న్నారు. ఆయన మృతితో సీఆర్పీ ఎఫ్ క్యాంపులో విషాదఛాయలు అలుముకున్నాయి.

వడదెబ్బకు గురయ్యారా..?

సీఆర్పీఎఫ్ ఏఎస్సై లక్ష్మణరావు మృతికి వడదెబ్బ కూడా కారణమని తెలుస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం సివిల్ పోలీసులతో కలిసి జాతీయ రహదారిపై ఆయన తనిఖీలు నిర్వహించారు. మళ్లీ సాయంత్రం కూడా డ్యూటీ చేయాల్సి ఉండగా ఆరోగ్యం బాగులేదని పాల్గొనలేదని తెలిసింది. స్టేషన్‌లోనే విశ్రాంతి తీసుకున్న క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, ఫిట్స్ రావడంతో ఆస్పతికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందారని తెలుస్తోంది.

ప్రమాద రహిత సంస్థగా ఎన్‌పీడీసీఎల్

నోడల్ అధికారి బీకంసింగ్

భూపాలపల్లిటౌన్, మే 4: విద్యుత్ ప్రమాద రహిత సంస్థగా రూపుదిద్దడమే లక్ష్యంగా టీఎస్ ఎన్‌పీడీసీఎల్ పనిచేస్తోందని జిల్లా నోడల్ అధికారి బీకంసింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విద్యుత్ భద్రతా వారోత్సవ సభలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు రక్షణ చర్యలు పాటించి ప్రమాద రహితంగా పనిచేయాలన్నారు. వినియోగదారులకు కూడా విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలని అన్నారు. మూగజీవాల ప్రాణాలు కాపాడడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ మల్హార్ నాయక్, డీఈ నాగరాజు, ఎస్ఏవోఏ దేవిదాస్, ఏడీఈ శ్రీనివాసుల యాదవ్, ఏఈలు, సబ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి సందర్శన



బాలల పరిరక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి

ములుగు కలెక్టరేట్, మే 4: జిల్లాకేంద్రంలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను, జిల్లా బాలల పరిరక్షణ కార్యాలయం, చైల్డ్ హెల్ప్‌లైన్, బాలల సంక్షేమ సమితి కార్యాలయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.కన్నయ్యలాల్ శనివారం సందర్శించారు. ఆయా కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, వసతుల గురించి అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, సఖి సెంటర్ అడ్మిన్ లావణ్య, లీగల్ ప్రొబిషన్ ఆఫీసర్ డి.సంజీవ్ ఉన్నారు.

జడ్పీటీసీ హరిబాబుకు మాతృవియోగం

గోవిందరావుపేట, మే 4: గోవిందరావుపేట జడ్పీటీసీ తుమ్మల హరిబాబుకు మాతృవియోగం జరిగింది. తల్లి తన్యరాణి (బుజ్జమ్మ) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందగా శనివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు, జడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, నాయకులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఎంపీపీ సూడి శ్రీనివా[illegible] మంగళసూత్రం చూపిస్తున్న పండితులు [illegible]ందనాయక్, లకావత్ నర్సింహనాయక్, పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, గై అశోక్, తలసిల ప్రసాద్, ఊట్ల మోహన్, తాటికొండ శ్రీనివాసాచారి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదె మృతి

వాజేడు, మే 4: గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదె మృతి చెందిన సంఘటన జాతీయ రహదారి పూసూరు-ముళ్లకట్ట వంతెనపై శుక్రవారం చోటుచేసుకుంది. గేదె కళేబరం రోడ్డుపై ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గేదె ఎవరిదనేది తెలియరాలేదు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

గోవిందరావుపేట, మే 4: మండలంలోని పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని చల్వాయి, పస్రా, రంగాపూర్, ముత్తాపూర్, ప్రాజెక్టునగర్ పోలింగ్ కేంద్రాలను ములుగు డీఎస్పీ రవీందర్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో చేపట్టిన ఏర్పా ట్లపై అధికారులతో చర్చించారు. ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట పస్రా సీఐ శంకర్, ఎస్సై కమలాకర్, సిబ్బంది ఉన్నారు.

రాఘవరెడ్డిపేటలో కార్డన్‌సెర్చ్

టేకుమట్ల, మే 4: మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామంలో శనివారం డీఎస్పీ సంపత్‌రావు నేతృత్వంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ఇళ్లల్లో క్షుణ్ణంగా సోదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో డీఎస్పీ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల జరగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వొద్దని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. ఎలాటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. భూర్నపల్లికి చెందిన మహిళ గుడుంబా విక్రయించేందుకు రాఘవరెడ్డిపేటకు రాగా ఆమెపై కేసు నమోదు చేశారు. పది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్ లేని నాలుగు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. సరైన పత్రాలు లేని 17 వాహన దారులకు జరిమానా విధించారు. కార్డన్‌సెర్చ్‌లో చిట్యాల సీఐ మల్లేష్, టేకుమట్ల ఎస్సై ప్రసాద్‌తోపాటు రేగొండ, మొగుళ్లపల్లి, చిట్యాల ఎస్సైలు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



సదానందం (ఫైల్)

వాజేడు, మే 4: కుటుం కలహాలతో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మడప సదానందం(28) చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయాడు. దీంతో పెద్దమ్మ, పెదనాన్నలైన మదనమ్మ, కృష్ణయ్య వద్ద పెరిగాడు. ఏటూరునాగారం మండలం భూటారం గ్రామానికి చెందిన శిరీషను ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్యకు, కుటుంబ సభ్యులకు మధ్య అప్పుడప్పుడు గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కూడా ఇంట్లో చిన్న ఘర్షణ జరగ్గా సదానందం మనస్తాపం చెంది పరుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు వాజేడు పీహెచ్ సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు.

'మతతత్వ పార్టీలను ఓడించాలి'

మహదేవపూర్, మే 4: పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ పార్టీలను చిత్తుగా ఓడించాలని వామపక్ష, కాంగ్రెస్ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ, సీపీఎం నాయకులు రాజమల్లు, బందు సాయిలు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. లౌకిక పార్టీలు మద్దతు ఇస్తున్న పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పదేళ్లపానలో ప్రజలకు బీజేపీ చేసిందేమీ లేదని విమర్శించారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజల మధ్య మతం పేరుతో చిచ్చుపెడుతోందని మండిపడ్డారు.

ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎర్రవెల్లి విలాసరావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కం అశోక్, ఎంపీపీ బన్సోడ రాణిబాయి, జడ్పీటీసీ అరుణ, మల్హర్ ఎంపీపీ మలహర్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలు పెంచుతున్న

బీజేపీని గద్దె దించాలి

టీపీజేఏసీ, టీపీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ రమాదేవి

కాటారం, మే 4: ప్రజల్లో మత విద్వేషాలను పెంచుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ రమాదేవి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో టీపీజేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 11వరకు నిర్వహించే ప్రచార కరపత్రాలను నాయకులతో కలిసి మండలకేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దివాలా తీసిందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పట్టింకుకోకుండా మతం, దేవుడు, ముస్లింలు అంటూ ప్రజల మధ్య విద్వేషాలను పెంచే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. దీనిని తెలంగాణ ప్రజలు తిప్పికొట్టి బీజేపీని ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీజేఏసీ నాయకులు పీక కిరణ్, అక్కల బాపు, పోచయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌ను వినియోగించుకున్న 30 మంది

ములుగు, మే 4: ములుగు జిల్లాలో రెండోరోజు శనివారం హోం ఓటింగ్ ద్వారా 30 మంది వృద్ధులు, దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మొదటి రోజు సంక్షేమ భవన్‌లో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా 199 మంది ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నారని తెలిపారు. రెండురోజుల పాటు జరిగిన హోం ఓటింగ్ ప్రక్రియలో ఓటుహక్కు వినియోగించుకోని ఓటర్లు ఈనెల 6న ఓటింగ్‌ను ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాట ుచేసిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చిన పోస్టల్ బ్యాలెట్‌లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు.

ఏటూరునాగారం: మండలంలో హోం ఓటింగ్ ప్రకియకు మండలంలో శనివారం ప్రారంభించారు. పీడబ్ల్యూడీ నోడల్ అధికారి స్వర్ణలత, స్థానిక సీడీపీవో హేమలత, సిబ్బంది వృద్ధ, దివ్యాంగ ఓటర్ల వద్దకు చేరుకున్నారు. మొదటి రోజు ఐదుగురు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా పీడబ్ల్యూడీ నోడల్ అధికారి స్వర్ణలత మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు పోలింగ్ సేషన్ వరకు వెళ్లలేని స్థితిలో హోం ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, బీఎల్వోలు సరోజ, లలిత కుమారి, పోలింగ్ అధికారులు అశ్విన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.